# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్/నారాయణపేట




ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

### కృష్ణ నీటి వాటాకై

## బ్యారేజ్ నిర్మించాలి

### ఎమ్మెల్సీ కోదండరామ్‌కు మెమొరాండం

**చిన్నంబావి,అలంపూర్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కృష్ణా నది నీటి వాట వినియోగానికై జోగులాంబ బ్యారేజ్ నిర్మించాలని బ్యారేజ్ సాధన సమితి నాయకులు పెరుమాళ్ళ శ్రీనివాస్, తుమ్మల రవికుమార్, పెరుమాళ్ళ తిరుపతి, అయ్యస్వామిలు కోరారు. ఆదివారం హైదరాబాదులో ఎమ్మెల్సీ కోదండరామ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కృష్ణ నీటి వాటా కోసం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ను అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృష్ణ బోర్డుపై ఒత్తిడి తేవాలని కోదండరామ్‌ను కోరారు. కాలేశ్వరం మాదిరిగా కృష్ణా నదిపై బ్యారేజీలు నిర్మాణం చేపట్టాలన్నారు. తెలంగాణ వాటాగా రావాల్సిన 763 టీఎంసీల వినియోగానికి నూతన బ్యారేజీలలో భాగంగా వెల్టూర్ గుందిమల్ల దగ్గర జోగులాంబ బ్యారేజ్ కం రోడ్ బ్రిడ్జి నిర్మించి వాటా, వరద జలాలు 150 టిఎంసీల నీటిని వాడుకోవచ్చని అన్నారు. అలాగే రోడ్డు బ్రిడ్జి నిర్మాణంతో రవాణా వ్యవస్థతో అలంపూర్, కొల్లాపూర్ నియోజకవర్గాల –మిగతా3లో..



తాసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మధుసూదన్‌నాయక్

### భూ సంబంధ సమస్యలు

## పరిష్కరించాలి

### - రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

### - మండలాల్లో విస్తృత పర్యటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు5, ప్రభాతవార్త :** రెవెన్యూ పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించా రు. నవాబ్ పేట్, కోయిల్ కొండ హన్వాడ, మహబూబ్ నగర్ అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయాల తనిఖీభూ భారతి దరఖాస్తులు –మిగతా3లో..

## జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పరిశీలించిన ఎస్పీ

**బాలానగర్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం 44వ జాతీయ రహదారిపై జిల్లా ఎస్పీ జానకి ట్రాఫిక్ పరిశీలించారు. దసరా సెలవులు ముగియడంతో గ్రామాల నుంచి హైదరాబాద్‌కు భారీగా వాహనాలు వెళుతున్నాయి.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ ట్రాఫిక్‌ను స్వయంగా పరిశీలించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా 44 వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ పెరగకుండా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నామని ఈసందర్భంగా ఎస్ఐ లెనిన్ తెలిపారు.



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ



# పెరిగిన సాగు

- గతేడాదికి 34వేల ఎకరాలు అధికం
- రైతులకు తొలగని యూరియా ఇబ్బందులు
- నానో యూరియా ఉపయోగించాలని ప్రభుత్వం సూచన
- నానోతో అధిక దిగుబడి: డీఏవో వెంకటేశ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు5, ప్రభాతవార్త :** గత ఏడాది కంటే పంటల సాగు పెరిగింది. 2024 వానాకాలంలో సాగైన పంటల విస్తీర్ణం 3,31,498 ఎకరాలు కాగా, 2025 వానా కాలంలో 3,64,573 ఎకరాల్లో పంటల విస్తీర్ణము ఉందని అధికారుల లెక్కల ద్వారా తెలుస్తున్నది. గతంతో పోలిస్తే ఈ యేడాది రైతులు యూరియా సమయానికి అందక నానా ఇబ్బందులు పడ్డారు. అధికారులు మాత్రం పంటల సాగు అధికంగా ఉన్న కారణంగా యూరియా కొరత ఏర్పడిందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం సూచన మేరకు రైతులంతా నానో యూరియాను ఉపయోగించాలని సూచిస్తున్నారు.

2024 వానాకాలం సాగుతో పోల్చినట్లయితే దాదాపు 34 వేల ఎకరాల సాగు ఈ 2025 వానా కాలంలో పెరిగింది. 2024 వానాకాలంలో సీజన్ చివరి వరకు అక్టోబర్ 2024 వరకు 23,984 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. 2025 వానకాలంలో రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు. 2025 వానకాలంలో 38,787 మెట్రిక్ టన్నుల కు గాను ఇప్పటి వరకు 23,238 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావడం జరిగిందని తెలిపారు. 2025సెప్టెంబర్ నెలలో 7700 మెట్రిక్ టన్నుల కు గాను 1500మెట్రిక్ టన్నులు రావటం జరిగిందని, యూరియా ర్యాక్ సరఫరా ననుసరించి డీలర్ లకు పంపిణీ చేశామన్నారు. సాధారణంగా వరి, మొక్కజొన్న పంటలలో యూరియా వినియోగం ఎక్కువ, రైతులు వరి పంటకు ఎకరాకు మూడు యూరియా బస్తాలు, మొక్కజొన్న పంటకు ఎకరాకు మూడు నుండి నాలుగు ఏరియా బస్తాలు వినియోగిస్తారు. రైతులు ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు కూడా దాదాపు 25 వేల ఎకరాలలో ఆలస్యంగా వరి నాట్లు వేయడం జరిగింది. ఆలస్యంగా నాట్లేసిన వరి పంటలకు యూరియా రిక్వైర్మెంట్ ఎక్కువ. అననంగా యూరియాను వేస్తేనే ఆలస్యంగా ముదురునారు వేసిన పంటలలో దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. అదనంగా పెరిగిన సాగు విస్తీర్ణం (50వేల ఎకరాలు) వల్ల యూరియా రిక్వైర్మెంట్ పెరిగింది. యూరియాకు ప్రత్నంయంగా నానో యూరియాను (చల్లి) పిచికారి చేసి మంచి దిగుబడులను పొందవచ్చని చెబుతున్నారు.

### 2024వానాకాలం..

| పంట | ఎకరాలు |
|---|---|
| 1.వరి | 1,94,982 |
| 2.మొక్కజొన్న | 22,583 |
| 3.పత్తి | 82,482 |
| 4.కంది | 11,388 |
| 5.ఇతరం | 1,386 |
| 6.కూరగాయలు, ఉద్యాన పంటలు | 17,283 |

### 2025 వానాకాలం..

| పంట | ఎకరాలు |
|---|---|
| 1.వరి | 2,19,610 |
| 2.మొక్కజొన్న | 39,469 |
| 3.పత్తి | 82,482 |
| 4.కంది | 11,388 |
| 5.ఇతర | 5,486 |
| 6.కూరగాయలు, | |
| 7.ఉద్యాన పంటలు | 20,283 |

### నానో యూరియా వాడండి..



నానో యూరియా నానో యూరియా ధర రూ.225/ (500 ఎంఎల బాటిల్) మాత్రమే, ఎకరాకు ఒక 500 ఎంఎల్ బాటిల్ సరిపోతుంది, రవాణా ఖర్చు ఉండదు, 80 నత్రజని పంటకు అందుతుంది. దీని పనితనం పంటపై ఎనిమిది నుండి పది రోజులు ఉంటుంది. మనం దీనిని పంటపై నేరుగా పిచికారి చేస్తాం కాబట్టి పంట యొక్క అన్ని భాగాలకు ఇది సులభంగా చేరుతుంది. సంవత్సరం వరకు దీన్ని వాడుకోవచ్చు. ఎరువుల కంపెనీలు నానో యూరియా ఉత్పత్తికి అంతరాయం కలిగే అవకాశం లేదు ఎందుకంటే దీని ఉత్పత్తిని తక్కువ ఖర్చుతో తక్కువ స్థలంలో చేసుకోవచ్చు. దీనికి రాయితీ ఏమీ లేదు కాబట్టి ప్రభుత్వంపై భారం ఉండదు తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడుతుంది. సాధారణ యూరియాసాధారణ యూరియా ధర రూ.267/ (50 కేజీల బస్తా), ఎకరాకు రెండు – మిగతా3లో..



జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద

## వరద తగ్గుముఖం

- జూరాల 13గేట్లు ఎత్తి నీటివిడుదల
- శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేత
- 210టీఎంసీలకు చేరిన నీటిమట్టం

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 5, ప్రభాతవార్త:** ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు స్వల్పంగా వరద నమోదవుతున్నది. పాలమూరు వరప్రదాయిని జూరాల 13గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నాయి. జలాశయానికి 1,29,000ఇన్‌ఫ్లో నమోదు కాగా, 6గేట్లు ఎత్తి దిగువకు 41,742క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పవర్‌హౌజ్‌కు 40476 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.824టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. జూరాల ఎడమ కాలువకు 550, క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 82,813క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.

### 883అడుగులకు చేరిన శ్రీశైలం

శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తున్నది. గతవారం రోజులుగా వరద ఉధృతి కారణంగా గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేయడంతో పర్యాటకుల సందడి నెలకొన్నది. వరద తగ్గుముఖం పట్టడంతో ఆదివారం గేట్లు మూసివేశారు. డ్యాం నీటిమట్టం 885అడుగులకు గాను 884.20అడుగులకు – మిగతా3లో..



పరిమితికి మించి ఆటోలో ప్రయాణీకులను తరలిస్తున్న దృశ్యం

### గ్రామాల్లో ఉపాధి లేక

## ఇతర గ్రామాలకు వలస బాట

- పరిధికి మించి ఆటోల్లో ప్రయాణం
- ఒక్కొక్క ఆటోలో 15 నుండి 20 మందికి పైగా ప్రయాణం
- అధికారలు ఇటుచూడరా..

**నారాయణపేటటౌన్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** గ్రామాల్లో ఉపాధి లేక ఇతర గ్రామాలకు రోజు వారీగా గత వారం రోజుల నుండి తల్లులు చిన్నపిల్లలను డబ్బుల కోసం పరిమితికి మించి ఆటల్లో ఇతర గ్రామాలకు వలస వెళుతున్నారు. ఏడుగురుతో వెళ్లాల్సిన ఆటో 15 నుండి 20 మంది మధ్య వెళుతున్నారు. ప్రమాదమని తెలిసినా ప్రయాణాలు ఆగడం లేదు. పోలీసుల కళ్ల ముందే పరిమితికి మించి ఆటోల్లో వెళుతున్న నియంత్రించడంలో పోలీసులు విఫలం అవుతున్నారు. ఉదయం 8:30 నుండి గ్రామం నుండి బయలుదేరి సాయంత్రం 7 గం.ల మధ్యలో తిరిగి ఇంటికి చేరుకుంటారు. ఇతర గ్రామాలకు కూలికి వెళ్ళితే ఒక్కొక్కరికి కూలి 500 నుండి 600 రూపాయలు ఇస్తారు. గతంలో పలుమార్లు ఇతర గ్రామాలకు వలసలు వెళ్లి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆటోల్లో పరిమితికి నుంచి వెళుతున్న వారిని చూసి కొందరు అవాక్కవుతున్నారు. కూలీలను వివరణ కోరగా గ్రామాల్లో ఉపాధి లేని కారణంగానే ఇతర గ్రామాలకు వెళ్తున్నామని తెలియజేస్తున్నారు. పరిమితికి మించి వెళ్లే ఆటోలపై దృష్టి సారించి నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

## ఘనంగా శ్రీనివాస కళ్యాణం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణం కౌరంపల్లి శివారులో వెలిసిన వెంకటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఈ దేవాలయం ప్రాంగణంలో శ్రీనివాస కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారి భక్తి గీతాలను లక్ష్మీ శ్రీ శోభన భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో గీతాలాపన చేశారు. అలాగే హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం మేనేజర్ హరీషా చారీ, అర్చకులు కోప్రేష్ చారీ, డా. అనీరుధ్ చారీ, రఘుప్రేమ్ తీర్థాచార్యులు, గోపినాథ్, మద్యేశ్ ఆచార్యులు, జి. రవీంద్ర చారీ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**గద్వాల టౌన్ అక్టోబర్ 5, ప్రభాతవార్త:** త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికలకు నియోజక వర్గం లోని నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గద్వాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గద్వాల మండల స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా ఎమ్మెల్యే ఎన్నికలలో నా గెలుపు కోసం కృషిచేసి నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి అవకాశాలు వచ్చే విధంగా వారి గ్రామాల రిజర్వేషన్లను అనుసరించి స్థానిక నాయకత్వం బట్టి ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేసి ఎంపీటీసీ ,జడ్పిటిసి సర్పంచుల అభ్యర్థులను గెలిపించి భవిష్యత్తులో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్త గుండెల్లో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత నాదే అని అన్నారు.అదేవిధంగా పలువురు నాయకులు ప్రసంగిస్తూమన మండలం, మన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎమ్మెల్యే బలపర్చిన అభ్యర్థిని గెలిపించి మన గ్రామాలను అభివృద్ధి చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానునందున గ్రామంలలో ప్రతి చోట చర్చలు పెట్టాలనీ, గతంలో మన నాయకులు గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి పరిచారన్న విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యే నాయకత్వంలో ఈ ఏడేళ్ల కాలంలో గ్రామాలలో జరిగిన అభివృద్ధినీ , తన వంతు సహకారంతో ప్రభుత్వాల సహకారంతో చేసిన –మిగతా3లో..



సమావేశానికి హాజరైన మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

### కనుల పండువగా

## శోభాయాత్ర

**మహబూబ్‌నగర్, అక్టోబరు5, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని శివశక్తినగర్ తెలుగు గేరిలో దేవీ నవరాత్రుల సందర్భంగా నెలకొల్పిన అమ్మవారు ఆదివారం శోభాయాత్రగా బయలుదేరి నిమజ్జనానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.కాలనీ మహిళలందరూ ఏకరూప దుస్తులను ధరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్ర త్యేక పూజలు భక్తిశ్రద్ధలు – మిగతా3లో..



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

## న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయ ఫలాలు

### తెలంగాణ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆపరేష్ కుమార్ సింగ్

**వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 5 ప్రభాతవార్త:** మెరుగైన వసతులతో కూడిన న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయ ఫలాలు దక్కాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలంగాణ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆపరేష్ కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో రూ.81 కోట్ల వ్యయంతో, 20 ఎకరాల స్థలంలో నూతనంగా నిర్మించనున్న 10+2 కోర్టు(పోక్సో, ఫ్యామిలీ కోర్టు కాంప్లెక్స్‌తో కలిపి) భవన సముదాయానికి తెలంగాణ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆన్లైన్ ద్వారా శిలా ఫలాకాన్ని ఆవిష్కరణ చేయగా, హై కోర్టు న్యాయమూర్తులు అనిల్ కుమార్ జూకంటి, మాధవి దేవి భూమి పూజ, శంఖుస్థాపన చేశారు. శంకుస్థాపనకు ముందు వనపర్తి జిల్లాకు విచ్చేసిన ముఖ్య అతిథులు హైకోర్టు న్యాయమూర్తులకు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ పూలమొక్కలు ఇచ్చి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం శంకుస్థాపన ప్రదేశంలో న్యాయమూర్తులు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. కోర్టు భవన నిర్మాణ ప్రాంగణంలో ముఖ్య అతిథులు మొక్కలు నాటారు.ముఖ్య అతిథులతో పాటు రిటైర్డ్ జడ్జి, తెలంగాణ ఈఆర్సీ ఛైర్మన్ డి నాగార్జున, వనపర్తి జిల్లా న్యాయమూర్తి ఎంఆర్ సునీత, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పీపీ కిరణ్ కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నూతన న్యాయస్థానాల్లో మెరుగైన వసతులతో అందరికీ న్యాయ ఫలాలు దక్కాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. పవిత్రమైన విజయదశమి పర్వదినాల సమయంలో వనపర్తి జిల్లాలో నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం ఆనందకర విషయమని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి కోర్టు నిర్మాణం త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షి స్తూ అందరికీ అభినందనలు తెలియజేశారు. శంకుస్థాపన అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో హైకోర్టు న్యాయమూర్తులు సభను ఉద్దేశించి మాట్లాడారు. జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం శుభ పరిణామం అన్నారు. న్యాయవ్యవస్థలో ప్రజలందరికీ న్యాయం చేకూర్చడం కోసం మంచి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఇప్పుడు న్యాయవ్యవస్థను బలోపేతం చేసే దిశగా నిర్మిస్తున్న ఈ నూతన కోర్టు కాంప్లెక్స్ అందరి ప్రయోజనాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ నూతన కోర్టు భవన నిర్మాణం కోసం అందరి కృషి ఉందన్నారు. అదేవిధంగా జిల్లాలో లీగల్ లిటరసీ కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. జస్టిస్ మాధవి మాట్లాడుతూ తాను ఉమ్మడి పాలమూరు జిల్లా ఆడబిడ్డనే అని చెబుతూ, వనపర్తిలో సంస్థానాదిషుల కాలం నుంచే న్యాయస్థానాలు ఏర్పాటు చేసి ప్రజలకు న్యాయం అందించే వ్యవస్థ ఉందని చెప్పారు. నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి అడగులు పడడంలో వనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు అయిన తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృషి ఉందన్నారు. దేవాలయం లాంటి ఈ కోర్టు భవనంలో ప్రతి ఒక్కరికి న్యాయ ఫలాలు అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా లీగల్ అథారిటీ సెల్ కార్యదర్శి రజిని, న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతరులు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు అనిల్ కుమార్ జూకంటి, మాధవి దేవి



ఆన్‌లైన్ ద్వారా శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అపరేష్ కుమార్ సింగ్

### డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ

## విద్యార్థులకు ఉపాధి కల్పించే దిశగా కృషి

**జడ్చర్ల అక్టోబర్ 5, ప్రభాతవార్త :** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చేరిన విద్యార్థులకు తక్కువ ఫీజుకే నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తుందని విద్యార్థి సేవా విభాగం (ఎల్ఎస్ఎస్‌బి) డైరెక్టర్ డా. వై. వెంకటేశ్వర్లు తెలిపారు. 2025.26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల గడువు అక్టోబర్ 10 వరకు ఉందన్నారు. బిఏ, బికాం, బిఎస్సీలో చేరే విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ 10+2 ఉత్తీర్ణులు కావాలన్నారు. విద్యార్థులు దరఖాస్తుల కోసం వెబ్ సైట్ ను సంప్ర దించాలన్నారు. ఓపెన్ యూనివర్సిటీలో చేరే విద్యార్థులకు రిటైల్ రంగంలో ఉపాధి కల్పించడానికి (ఆర్ఏఎస్‌సిఐ) సంస్థతో యూనివర్సిటీ ఒప్పందం చేసుకుందన్నారు. విద్యార్థులు ఒకేషనల్ ట్రైనింగ్ లో ఆసక్తి ఉంటే రామనందతీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ కల్పిస్తమన్నారు. సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు పీజీలో సామాజిక శాచదువుకునే అశకాశం ఉందన్నారు. డిగ్రీ ఉత్తర్ణులైనవారు బీటెక్, బిఎస్‌సి, బిబిఏ విద్యార్థులు పీజీ కోర్సులైన ఎంఏ ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, చరిత్ర, ఎకనమిక్స్, సోషియాలజీ, ఎంఏ జర్నలిజం కోర్సులను చదువుకునే అవకాశం ఉందన్నారు. బిఎస్సీ సైన్స్ విద్యార్థులు ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎన్వీరాన్ మెంట్ సైన్స్ చదువుకోవచ్చన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

### సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా

**నారాయణ పేట, అక్టోబరు 5 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం నారాయణ పేట జిల్లాలో తక్షణమే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సామాజిక కార్యకర్త హెచ్ నర్సింహా విజ్ఞప్తి చేశారు అధిక వర్షాల కారణంగా ఈసారి పత్తి దిగుబడి తీవ్రంగా తగ్గిందని తెలిపారు. గత సంవత్సరం ఎకరాకు సగటు 10క్వింటాళ్ల దిగుబడి వస్తే ఈసారి 4 క్వింటాళ్లు కూడా రానీ పరిస్థితి ఉంది అని చెప్పారు. పత్తి విత్తనాలు ఎరువులు పిచికారీ మందులు కలుపు తొలగింపు పత్తి తీయుట వంటి ఖర్చులను కలిపి ఎకరాకు సుమారు. 30,000 వ్యయం అవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ దళారులు క్వింటాలుకు రూ. 5,000 మాత్రమే ఇస్తుండటంతో రైతులు నష్టాల్లో మునిగిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వ్యవసాయశాఖ మంత్రి, సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని సీసీఐ అధికారులతో చర్చించి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని నర్సింహా కోరారు. ఈ సమావేశంలో రైతులు ఉప్పు ఆంజనేయులు, బడేసాబ్ గుడిసె రామాంజనేయులు, మ్యాకలి ఆంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా

## నేడు స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం

### ఏఎంసి చైర్మన్ రాంపురం శివారెడ్డి

**నారాయణపేట టౌన్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** నేడు స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మా జీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాలమేరకు ఉదయం11:00 గంటల కు సివిఆర్ భవన్‌లో జరగనున్నట్లు ఏఎంసి చైర్మన్ రాంపురం శివారెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందుకుగాను ప్రతి గ్రా మం మరియు మండలస్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ జడ్పీటీసీల, వార్డు మెంబర్ల ఆశావా హులు పాల్గొని పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారంటీలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మండల పరిధిలో ని మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ లు, మాజీ జెడ్పీటీసీలు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారి గత ఎన్నికల అనుభవాలను పంచుకోవాల్సిందిగా కోరారు.

## కాంగ్రెస్‌కు ఎన్నికల భయం

### ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ కుమార్

**నారాయణపేట టౌన్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులకు ఎన్నికలభయం పట్టుకుందని అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధంగా లేరని బిజెపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్ని కల హామీలో ఇచ్చిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం బిల్లు, ఆర్డినె న్సులు ఎన్ని తెచ్చినా కోర్టు ఆపుతుందంటూ జిమ్మిక్కులు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసిల పట్ల అసలు చిత్త శుద్ధి లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదించి 42 శాతంలో 10 శాతం ముస్లీంలకు కేటాయిస్తూ బిల్లును కేంద్రానికి పంపించడం తోనే కాంగ్రెస్ ప్రభుత్వం అసలు రంగు బయటపడిందని అన్నారు. మతపర రిజర్వేషన్లు చట్ట విరుద్ధం అని రాజ్యాంగం చెబుతున్నదనే నెపాన్ని కేంద్రంలో ఉన్న బిజెపిపై నెట్టడానికేనని అన్నారు. అంతే కాకుండా రిజర్వేషన్ల అంశం కోర్టులో ఉండగా రిజర్వేన్లను ప్రకటిం చడం అది ఎలాగో కోర్టు కొట్టి వెస్తుందన్న విషయం తెలిసి బిసిలను మభ్యపెట్టడం కోసమేనన్న విషయం ప్రజలు గుర్తిస్తారని అన్నారు. కేవలం ఓటమి భయంతోనే జిమ్మిక్కులు చేస్తు ఎన్నికలకు వెళ్ళడం లేదని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు జరిపినా ప్రజలు కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు.

## యాకూబ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, అక్టోబరు 5 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన వార్త దినపత్రిక రిపోర్టర్ యాకూబ్ మాతృమూర్తి గుండెపోటుతో ఇటీవలే మరణించడం జరిగింది. ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి జర్నలిస్ట్ నివాసానికి వెళ్లి, యాకుబ్‌ను, వారి కుటుంబసభ్యులను, పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజేషన్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, బీసీ సెల్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరేష్, మైనార్టీ అధ్యక్షులు నజీర్, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు ఒలియోద్దీన్, ప్రభు, కొండన్న, ఎండిరఫీ, ప్రసాద్, పుట్టపల్లి చెన్నకేశవులు, శ్రీనివాస్ రెడ్డి, నాగన్న, నసీర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## పేటలో దుర్గాష్టమి వేడుకలు విజయవంతం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో దేవీ నవరాత్రి వేడుకలు ఈ సారి అత్యంత ఘనంగా జరిగాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీంచందర్ గౌడ్, కార్యదర్శి మిర్చి వెంకటయ్య తెలిపారు. అమ్మవారిని నవరాత్రులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారన్నారు. నవరాత్రులు సజావుగా సాగేలా సహకరించిన భక్తులకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### మిత్ర ఫౌండేషన్ నూతన అధ్యక్షుడిగా

## కుకుడాల శ్రీకాంత్ నేత నియామకం

**కల్వకుర్తి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** మిత్ర ఫౌండేషన్ 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ చౌరస్తాలో మిత్ర ఫౌండేషన్ లోగోతో తయారు చేసిన జెండాను ఆవిష్కరించారు. గత మూడు సంవత్సరాలుగా మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా రకాల కార్యక్రమాలు, ఆర్థిక సహాయాలు, సమాజ అవగాహన కార్యక్రమాలు ఎన్నో నిర్వహించారు. ప్రతి సంవత్సరం నూతన అధ్యక్షుడి ఎన్నికలో భాగంగా మిత్ర ఫౌండేషన్ నూతన అధ్యక్షుడిగా కుకుడాల శ్రీకాంత్ నేతను ఫౌండేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఫౌండర్ కుదుముల చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా రవుఫ్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా రాఘవేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కార్తీక్, దేవర్ల మహేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా తరుణ్, శ్రీకాంత్ గౌడ్, సలీంఖాన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ సమాజంలో మా వంతు సహాయంగా విద్య, ఆరోగ్యం, ఆర్థిక సహాయం, సమాజ అవగాహన కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణ లాంటి కార్యక్రమాలను చేపడుతామని, పలువురికి ఆదర్శంగా నిలుస్తామన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన ఏఎన్ఎం కూతురు

**దామరగిద్ద, అక్టోబరు 5 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలో ని వెంకటేశ్వర కాలనీ కి చెందిన బర్ల రామలింగమ్మ, ఆనంద్ కూతురు సాయి కీర్తన ఎంబిబిఎస్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ కామారెడ్డి నందు సీటు సాధించింది. తల్లి ఏఎన్ఎంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తుంది. కూతురు ఎంబిబిఎస్ సీటు రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. సాయి కీర్తనకు ఎంబీబీఎస్ సీట్లు రావడం పట్ల పలువురు అభినందించారు.


సాయికీర్తన

# భూత్పూర్‌లో ఘనంగా ముస్లింల గ్యార్వీ వేడుకలు

**- వేర్వేరుగా దర్గాను దర్శించుకున్న**

**ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**

**భూత్పూర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలో ముస్లింలు గ్యార్వీ పండుగ వేడుకల్ని ఆదివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు నిర్వహించిన గ్యార్వీ వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) పాల్గొని పట్టణ కేంద్రంలోని మహిబూబ్ సుభాని దర్గాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. గ్యార్వీ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్‌ను భూత్పూర్ ఉమ్మడి మజీద్‌ల కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే జీఎంఆర్ వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి అబుబాకర్ సిద్ధిఖీలతో పాటు కాంగ్రెస్ నాయకులు బోరింగ్ నర్సింహులు, జమీర్, అఫ్రోజ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల**

గ్యార్వీ పండుగ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇక్కడి ముస్లింల పిలుపు మేరకు ఆదివారం భూత్పూర్‌లోని మహిబూబ్ సుభాని దర్గాను సందర్శించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మక్కా ఉమ్రాకు వెళ్తున్న రిటైర్డ్ ఎస్సై సాధిక్‌ను మాజీ ఎమ్మెల్యే ఆల శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకుఉలు టి మురళిధర్‌గౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, గడ్డం ప్రేమ్‌కుమార్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మనెమోని సత్యనారాయణ, మేకల సత్య నారాయణ, సత్తూర్ అశోక్‌గౌడ్, గడ్డం రాములు, బాల్‌రెడ్డితో పాటు మైనార్టీ నాయకులు మొహ్మద్ సాధిక్, మొహ్మద్ అహ్మద్, మొహ్మద్ జహంగీర్, మొహ్మద్ యాసిన్, మొహ్మద్ ఖదీర్, మొహ్మద్ నయీం, మొహ్మద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. ముందురోజు శనివారం రాత్రి ముస్లిం యువకులు గ్యార్వీ భారీ జెండాను పట్టణంలో భారీ ర్యాలీతో ఊరేగింపు నిర్వహించారు.


గ్యార్వీ సందర్భంగా భూత్పూర్ మహిబూబ్ సుభాని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్


భూత్పూర్‌లో జరిగిన గ్యార్వీ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# వ్యాపార రంగంలో ముందుకు రాణించాలి

### ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల అక్టోబర్ 5, ప్రభాతవార్త:** చిన్న చిన్న వ్యాపారాలు ప్రారం భించి 10 మంది యువతకు ఉపాధి కల్పించి వ్యాపార రంగంలో ముందుకు రాణించాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి. అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి తులక్షేత్రంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన బి ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నారాయణ నాయుడు ఆహ్వానం మేరకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి. అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు. చల్లా అగస్త్య రెడ్డి. మరియు గద్వాల నియోజకవర్గ బి. ఆర్.ఎస్ పార్టీ ముఖ్య నాయకుడు బాసు హనుమంతు నాయుడు. రమేష్ నాయుడు హాజరై నారాయణ నాయుడుకు చెందిన నూతన పరమేశ్వర్ లాడ్జిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పుణ్యక్షేత్రంలో మరియు మంచి లొకేషన్ ప్రాంతంలో భవనం నిర్మించడంతో యజమానిని ఎమ్మెల్సీ అభినందించారు. అనంతరం యజమాని నారాయణ నాయుడు కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ. ఎమ్మెల్యే. ముఖ్య అతిథులను శాలువా పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యజమాని కుటుంబ సభ్యులు అలాగే చల్ల అభిమానులు పార్టీ నాయకులతో కలిసి సంతోషంగా ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ రంగారెడ్డి. మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి. మండల బి ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి. పార్టీ ముఖ్య నాయకులు పరమేశ్వర్ రెడ్డి. వావిలాల రంగారెడ్డి. శేషి రెడ్డి. రఘు రెడ్డి. అనంతరెడ్డి. ఆర్ కిషోర్. గోపాల్. మాజీ సర్పంచ్ సుంకన్న. రవి ప్రకాష్. ఉమ్మడి మండల బి. ఆర్.ఎస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు యువత. యజమాని కుటుంబ సభ్యులు. అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


బీచుపల్లిలో భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ, చల్లా ఎమ్మెల్యే విజయుడు

# అభ్యర్థుల ఎంపికలో దూకుడు పెంచిన కాంగ్రెస్

**ఆత్మకూర్ అక్టోబర్ 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి అంటూ ప్రకటించిన నేపథ్యంలో మక్తల్ నియోజకవర్గం లోని ఉమ్మడి ఆత్మకూరు మండలంలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. అసలు ఎన్నికలు జరుగుతాయో లేదో ఈనెల 8న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించనున్న నేపథ్యం కలిగి ఉన్నప్పటికీ ఉమ్మడి ఆత్మకూరు మండలంలో మాత్రం గత పది సంవత్సరాలుగా అధికారానికి దూరమై ఆపసోపాలు పడుతున్న గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ మరియు జెడ్పిటిసి పదవులపై కన్నేసి టికెట్లు సాధించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే శనివారం రోజు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆత్మకూర్ జడ్పిటిసి అభ్యర్థి కోసం మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ మరియు గత శాసనసభ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తున్నటువంటి ఆత్మకూరు మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి సైతం సీటు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలిసింది. ఓవైపు అధికార పార్టీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రతినిత్యం ఏదో కార్యక్రమం చేపడుతూ అభ్యర్థుల ఎంపికలు తగు జాగ్రత్తలు తీసుకుంటూనే దూకుడు పెంచిన నేపథ్యంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ మరియు బీజేపీ పార్టీలు మాత్రం ఇప్పటివరకు ఎన్నికల ఒసు ఎత్తకపోవడం పలువురు వింతగా చర్చించుకుంటున్నారు. అసలు ఎన్నికలే జరిగానప్పుడు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి తొందరగా వీఆర్ఎస్ బిజెపి నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటూ ఉండడం మరో విశేషం. శనివారం రోజు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగిన ఆత్మకూర్ జడ్పిటిసి అభ్యర్థిత్వం కోసం ఎనిమిది మంది తీవ్రస్థాయిలో పోటీ పడడంతో అధిష్టానానికి నివేదించినట్లుగా జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రకటించడం విశేషం. ఇదిలా ఉండగా జిల్లా పార్టీ నుండి రాష్ట్ర పార్టీకి ఆత్మకూరు మండలం నుండి కేవలం ముగ్గురి పేర్లు మాత్రమే పంపించినట్లుగా కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది ఏది ఏమైనప్పటికీ స్థానిక అసంస్థలు ఎన్నికలకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో తల మునకలై ఉండగా ప్రతిపక్ష పార్టీలు మాత్రం అభ్యర్థుల ఎంపిక ఒక కనీస చర్యలు చేపట్టకపోవడం పట్ల పలువురు విశేషంగా చర్చించుకుంటున్నారు...

# విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలపడమే మా ధ్యేయం

**ఇటిక్యాల అక్టోబర్ 5, ప్రభాతవార్త :** పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మంచి బోధన అందించి విద్యార్థులలో ఉన్నత స్థానంలో నిలపడమే ఉపాధ్యాయుల బాధ్యత అని ట్రైనర్స్ వివరించారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో ఇంటర్నేషనల్ పాఠశాలలో జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో ఉన్న ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్స్. మరియు టీచర్స్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా వారు సరస్వతి చిత్రపటానికి పూలమాలవేసి పూజ కార్యక్రమం నిర్వహించారు. సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాలలో తెలుగు, గణితం మరియు ఆంగ్ల తరగతి మరియు భాషపై పూర్తి అవగాహనతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెబుతున్నారని వీరికి కూడా మనం అధ్యాపకులుగా మారి మనం కూడా నేర్చుకుంటే విద్యార్థులకు కూడా బోధన క్రియలో అర్థమయ్యే రీతిలో చెప్పే విధంగా మెలుకువలను నేర్చుకునే విధానంపై ఓరెంటేషన్ క్లాస్ నిర్వహించుకున్నారు. ఓరియంటేషన్ క్లాస్ కు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర స్కూల్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఓరియంటేషన్ కార్యక్రమంలో ట్రైనర్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, స్పోకెన్ ఇంగ్లీష్ ట్రైనర్ సుప్రియ, జిల్లా అధ్యక్షులు బాబు నాయుడు, సరస్వతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, చైర్మన్ మరియు గౌరవాధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి బీచుపల్లి. కోశాధికారి మోహిన్ పాషా, రమేష్ బాబు, మరియు జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్స్. మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాలలో ఓరియంటేషన్ క్లాసులో పాల్గొన్న ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు

### ధ్వంసమైన రహదారులకు

# తక్షణమే మరమ్మతులు చేయాలి

### భాజపా సీనియర్ నాయకుడు బిజ్వార్ మహేష్ గౌడ్

**ఊట్కూర్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భాజపా సీనియర్ నాయకుడు బిజ్వార్ మహేష్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పులిమామిడి నుండి బిజ్వార్ మీదుగా అవసలోనిపల్లి, పెద్దజట్రం వెళ్లే రహదారి, అలాగే మగ్దంపూర్ నుండి ఊట్కూర్ రహదారి సహా మండలంలోని ప్రధాన మార్గాలు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని అన్నారు. వాహనదారులు ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారని, తక్షణమే ఆర్అండ్‌బి శాఖ అధికారులు పర్యవేక్షణ చేసి పూర్తిగా ధ్వంసమైన రహదారులపై మరమ్మతు పనులు ప్రారంభించాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. గ్రామస్తులు కూడా ఈ రహదారుల పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడిన ప్రతీసారి రోడ్లు చెరువుల్లా మారి, వాహనాలు నడపడం కష్టమవుతోందని వారు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకుని రహదారుల పునరుద్ధరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న రోడ్డు


స్వామివారి ఆలయంలో పూజలు చేస్తున్న జాయింట్ డైరెక్టర్

## అమ్మవారి సన్నిధిలో జాయింట్ డైరెక్టర్

**అలంపూర్ అక్టోబర్ 5, ప్రభాతవార్త :** అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఆదివారం రోజు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వీరికి ఆలయ అధికారులు సాగర స్వాగతం పలికి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, జోగులాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం వీరికి ఆలయ అర్చకులు కండువతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయాల విశిష్టతల గురించి ఆలయ అర్చకులు వారికి వివరించారు. వీరి వెంట వార్డెన్లు సుజాత, ప్రసాద్, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.


వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**భూత్పూర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం భూత్పూర్ మున్సిపాలిటీ నాల్గొవార్డులో జరిగిన నర్సింహులు యాదవ్–స్వప్నల వివాహానికి హాజరై నూతన వధూవరుల్ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, టి మురళిధర్‌గౌడ్, సత్తూర్ నారాయణగౌడ్, మనెమోని సత్యనారాయణ, గడ్డం ప్రేమ్‌కుమార్, మేకల సత్య నారాయణ, గడ్డం రాములు, సత్తూర్ అశోక్‌గౌడ్, రాము రాథోడ్, గడ్డం డీలర్ నర్సింహులు, సత్తూర్ రాకేష్‌గౌడ్, బైకాని శివ పాల్గొన్నారు.


వేముల గ్రామానికి విద్యుత్తు సరఫరా చేసే చిన్న ట్రాన్స్‌ఫారాలు

## వేములలో 3 నెలలుగా కరెంటు కష్టాలు

**ఇటిక్యాల అక్టోబర్ 5, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల గ్రామంలోని ప్రజలు మూడు నెలలుగా కరెంటు ఓవర్‌లోడ్ సమస్యతో అవస్థలు పడుతున్నారని అదే గ్రామానికి చెందిన బిజెపి మండల పార్టీ అధ్యక్షులు జగదీశ్ రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. గ్రామంలో ఉన్న ట్రాన్స్ ఫారం కరెంటు సరఫరాకరెంటు సరఫరాలో ఓవర్ లోడ్ సమస్య వల్ల ఫ్యూజులు నిలవడం లేదని ఎన్నిసార్లు వేసిన అవి మళ్లీ మళ్లీ కాలిపోవడం జరుగుతుందన్నారు. వేముల గ్రామంలో ప్రజలు పడుతున్న కరెంటు సరఫరా ఓవర్ లోడ్ సమస్యను విద్యుత్‌శాఖకు చెందిన జిల్లా ఎస్సీ. ఈ. డి. ఈ. సంబంధిత మండల ఏఈ స్పందించి వేముల గ్రామంలో హెవీ కెపాసిటీ గల ట్రాన్స్ ఫారం ను ఏర్పాటు చేసి గ్రామ ప్రజల కరెంటు కష్టాలు తీర్చాలని గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

### గంగపుత్ర యూత్

## ఆధ్వర్యంలో ఆర్థికసాయం

**వెల్దండ, అక్టోబర్ 5 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన చెర్క కృష్ణయ్య ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని గంగపుత్ర యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పరామర్శించి కుటుంబ సభ్యులకు చందా రూపంలో రూ. 23వేలు సమకూర్చి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు సందీప్, రమేష్, శశికాంత్, బాలకృష్ణ, శ్రీను, సాయి, శివ, గంగరాజు, పరుశురాములు, బాలయ్య, నరేష్, చంద్రమౌళితో పాటు తదితరులు ఉన్నారు.

# దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి

**ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ పత్తికొండ రాము**

**రాజాపూర్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది దసరా ఉత్సవంలో భాగంగా జడ్పీ హెచ్ఎస్ రాజాపూంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కార్యవాహ పత్తికొండ రాము మాట్లాడుతూ సంఘం



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ పత్తికొండ రాము

స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయినది. ఈ సందర్భంగా పంచ పరివర్తన సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ,స్వదేశీ నియమావళి, పౌర నియమావళి,కుటుంబ నియమావళి పాటించాలని దేశం కోసం ధర్మం కోసం పని చేయాలని సమయం ఇవ్వాలని భారతదేశం విశ్వ గురువు స్థానం వచ్చే విధంగా పనిచేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల స్వయంసేవకులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

# వైభవంగా దసరా ముగింపు ఉత్సవాలు

**వాసవి మాతను దర్శించుకున్న జిల్లెల చిన్నారెడ్డి**

**పెబ్బేరు, అక్టోబరు 5 ప్రభాతవార్త :** దసరా పండుగ ముగింపు ఉత్సవాలు ఆదివారం పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వైభవంగా ముగిశాయి. 26 మంది ఆర్యవైశ్య దంపతులతో ఆలయ అర్చకులు కిట్టు స్వామి బృందం పూర్ణాహుతి హోమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వెండి చీరతో విశేషంగా అలంకరించి మహా మంగళహారతి నీరాజనం ఇచ్చారు. తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, స్థానిక రాజకీయ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రుల్లో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు, మహిళలకు ఆర్యవైశ్య నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. సాయంత్రం వాసవిమాత ఉత్సవ విగ్రహంతో పట్టణంలోని నురవీధుల గుండా శోభా యాత్ర చేశారు.మహిళలు, పురుషులు స్థానిక సుభాష్ చౌరస్తాలో కోలాటం, బతుకమ్మలు, పిల్లల నృత్యాలతో సందడి చేశారు. బాణాసంచా కాల్చి ఉత్సవాలకు ఊపు తెచ్చారు. అక్కడి నుంచి బీచుపల్లికి వెళ్లి కృష్ణా నది వద్ద అమ్మవారికి నదీ స్నానం చేయించారు. పెళ్లికాని యువతీ, యువకులకు ప్రత్యేక పూజలు చేశారు.

# ఈద్గాన్ పల్లిలో ఎన్నికల సలహా కమిటీ సమావేశం

**రాజాపూర్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లి,నాయిన్ చెర్వు తండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎంపిటిసి ఆశావాహుల అభ్యర్థుల నుండి వినతులను ఆదివారం 5 మెన్ కమిటీ సభ్యులు సేకరించిన ఎంపిటిసి అభ్యర్థుల వినతి పూర్తి వివరాలను డిసిసి, పిసిసికి పంపించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 5 మెన్ కమిటీ సభ్యులు జవాజిశేఖర్‌గౌడ్ ఎఎంసి వైస్‌చైర్మన్,విస్లావత్ శ్రీనివాసులునాయక్,ఆవుల మందలక్ష్మయ్య,మేకల శ్రీశైలం యాదవ్, రెడ్డి రెడ్డి రమేష్‌రెడ్డి,సత్యనారాయణ ఎఎంసి డైరెక్టర్, పంచాక్షరీ ఎఎంసి డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఐవైసి అద్యక్షులు,జెసిఎల్ కాంగ్రెస్‌నాయకులు గోపీనాథ్ నాయక్, కావలి శివకుమార్, మైపాల్ రెడ్డి, జంగయ్య,లక్ష్మయ్య,హీరాలాల్,మహేందర్,రాందాస్,వేణు, మేగ్య, కిషన్, శ్రీను నాయక్, అర్జున్, సంజూ, తిరుపతి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థుల నుండి వినతులను సేకరించిన దృశ్యం

# ఎమ్మెల్యే కారును ఢీకొన్న బైకు

**యువకుడికి స్వల్ప గాయాలు**

**జడ్చర్ల, అక్టోబరు 5 ప్రభాతవార్త:** జడ్చర్ల నుండి కల్వకుర్తి వైపు బైకు పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు ఎమ్మెల్యే కారును ఢీకొట్టడంతో స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వాడ్యాల గేటు సమావేశంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు నరసింహ కుటుంబ సభ్యులు శుభకార్యంలో పాల్గొనడానికి వచ్చారు. ఎమ్మెల్యే కారు దిగి ఫంక్షన్ హాల్ వైపు వెళ్లారు.అదే సమయంలో ఎమ్మెల్యే డ్రైవర్‌కారును రోడ్‌సైడ్ తీస్తుండగా జడ్చర్లనుండి కల్వకురిక్తి బైక్‌పైవెళ్తున్న గణేష్ కారును ఢీకొట్టడంతో స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ గణేష్ తలకొండపల్లి మండలం గట్టిపల్లి గ్రామానికి చెందిన యువకుడు. వెంటనే స్పందించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు మిడ్జిల్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. గాయపడ్డ గణేష్‌ను ఎమ్మెల్యే హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. స్వల్పంగా గాయపడడంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి**

**మహబూబ్‌నగర్,అక్టోబరు5,ప్రభాతవార్త:** మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్1 ఫలితాల్లో డీఎస్పీ సెలెక్ట్ అయిన డి సౌమ్యను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో రిషిలో విద్యాభ్యాసం చేసి గ్రూప్ వన్ పోస్ట్ సాధించడం గర్వకరాణమన్నారు. ఆమె మరిన్న ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడ్వకేట్ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సౌమ్యను సన్మానిస్తున్న సాహితిరెడ్డి

# కృష్ణ నీటి వాటాకై బ్యారేజ్ నిర్మించాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అభివృద్ధి జరుగుతుం దని ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలియజేశారు. ఇట్టి అంశంపై ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ గత మూడేళ్ల క్రితం అట్టి ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని, జోగులాంబ బ్యారేజ్ ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి వనపర్తి జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాషా, ఊట్కూరు మాజీ సర్పంచ్ మధ్యల అయ్యస్వామి, బోరెల్లి శ్రీనివాస్, పెరుమాళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# భూ సంబంధ సమస్యలు పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పెండింగ్‌పై సమీ భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఆదివారం ఆయ నవాబ్ పేట్, కోయిల్ కొండ హన్వాడ, మహబూబ్ నగర్ అర్బన్ మండలాల్లో విస్తృతంగా పర్యటించి ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు.మండల తహశీల్దార్,రెవెన్యూ సిబ్బందితో భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల పై,ఎలక్షన్ క్లెయిమ్స్ క్లియర్ చేయాలని ఆదేశించారు.



కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మధుసూదన్‌నాయక్

# ఎన్నికల ముందు జోరందుకున్న కారు స్పీడ్

## కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్‌లోకి చేరికలు

**గద్వాల టౌన్ అక్టోబర్ 5, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికలు సమీపస్తాడడంతో గద్వాల నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ యస్ పార్టీ లోకి చేరికలు జోరందుకున్నాయి. శనివారం గద్వాల నియోజకవర్గ బిఆర్ యస్ పార్టీ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ధరూర్ మండల ఎమ్మోనిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొంతమంది గులాబీ జెండా తీర్థం పుచ్చుకోగా ఆదివారం కూడా నియోజక వర్గంలోనీ మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు బిఆర్ యస్ పార్టీ లో చేరారు. ఆదివారం ధరూర్ మండలం ఫార్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి బాసు హనుమంతు నాయుడు పార్టీ కండువా కప్పి,పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీ లో చేరిన వారిలో గుంత సవరన్న, గుంత వెంకటేశ్వర్లు, దుబన్న, వేమన్న, పుండు కూర గోపాల్, వాసు కృష్ణ, నాయక్ ఎల్ఐసి, గట్టుచిన్నవెంకటేష్, ఆంజనేయులు, గోపాల్, హరిజన వెంకటన్న, హరిజన జైపాల్, రాజు, సంతోష్ కుమార్, ఎస్సీ నర్సింహులు, గౌళ కరెప్ప, చెట్టుకింద ఆంజనేయులు, కావాలి బస్వరాజు, గుంత శ్రీనివాసులు, పరశురాముడు, మీసాల సవరన్న, హనుమంతు, రంగస్వామి, ఆంజనేయులు తో పాటు దాదాపు 200 మంది ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీ లోకి చేరారు. అదేవిధంగా కె.టీ.దొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్ రెడ్డి, చిన్న నర్సింరెడ్డి, రఘునాథ్ రెడ్డి, మహానంద రెడ్డి, డోలు వీరన్న, నాగిరెడ్డి, లక్ష్మీ మ్రకాంతరెడ్డి, వీరారెడ్డి, పెద్ద రంగన్న రెడ్డి, తిమ్మారెడ్డి, తదితర ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి హనుమంతు నాయుడు పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేష్ నాయుడు,చక్రిధర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, శ్రీరాములు, భరత్ సింహారెడ్డి, గోవిందు, ప్రహ్లాద్, వెంకటేష్, పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాసు హనుమంతు నాయుడు

# ఆదర్శ ప్రాయుడు రాజమోహన్ రెడ్డి

**అందరి హృదయాల్లో చిరంజీవిగా నిలిచి పోతాడు**

**ఉపాధ్యాయుడు రాజమోహన్ రెడ్డి సంస్మరణ సభ**

**మిత్రమండలి సభ్యులు**

**మహబూబ్‌నగర్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** గత నెల సెప్టెంబర్ 18న పరమపదించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజమోహన్ రెడ్డి సంస్మరణ సభ మిత్రమండలి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, బంధు మిత్రులు పాల్గొని ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజమోహన్ రెడ్డి అజాతశత్రువు స్వభావం గల ఉపాధ్యాయుడు. ఆర్ఎస్ఎస్ సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, టిపియూఎస్ ఉపాధ్యాయ సంఘం ద్వారా సేవలందించారు. అని సంఘాలతోనూ ఆత్మీయ సంబంధాలు కలిగి అందరివాడిగా ఎదిగిన రాజమోహన్ రెడ్డి అకస్మాత్తుగా మరణించడం అందరి మనసులను కలచివేసింది" అని అన్నారు. మిత్రుడు రాష్ట్ర బిజెపి నాయకులు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాలేజీ దశ నుండే నా వెన్నంటి ఉండి, నేను నడిచే దారిలో సహకారం అందించిన సహచరుడు రాజమోహన్ రెడ్డి. అందరినీ కలుపుకునే గొప్ప గుణం కలిగి, నిష్కల్మషమైన వ్యక్తిత్వం గల మనిషి. ఆయన కుటుంబానికి అన్నివిధాలుగా సహకారం అందిస్తాము" అని తెలిపారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాజమోహన్ రెడ్డి లాంటి వ్యక్తిత్వం గల మనిషి సమాజంలో దొరకడం చాలా అరుదు. ఆయన పట్టుదల, కార్యదక్షత ప్రశంసనీయమైనవి" అన్నారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజమోహన్ రెడ్డి మన అందరి మనసుల్లో శ్రీరామచంద్రుడి లాంటి మహోన్నత వ్యక్తి. అన్ని సుగుణాలు కలిగిన వ్యక్తిని ఇంత చిన్న వయసులో కోల్పోవడం ఎంతో బాధాకరం" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా టిపియూఎస్ జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్ వ్యవహరించగా, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మిథున్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ కార్యవాహ రాం రెడ్డి, జిల్లా సంఘచాలక్ వసంతం వెంకటేశ్వర్లు, విద్యా భారతి సొసైటీ చైర్మన్ శేషప్ప, రాం చంద్ర చందర్ ఏబీవీపీ విభాగ్ ప్రముఖ్, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు-ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, అనేక మంది ఉపాధ్యాయులు సంఘాల ప్రతినిధులు, రాజమోహన్ రెడ్డి సతీమణి శైలజ బంధువులు, మిత్రబృందం, అనేకమంది సహచరులు పాల్గొన్నారు.



రాజా మోహన్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



బిజెపి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు

## ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం కృషి చేయాలి

**ధన్వాడ, సెప్టెంబరు 5 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని హనుమానపల్లి గ్రామ బీజేపీ కార్యకర్తల సమావేశములో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీ సర్పంచ్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు అందరూ కలిసి గెలుపు కోసం కృషి చేయాలని కోరడం జరిగింది. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జె.గోవర్ధన్ గౌడ్, ఓబిసి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు శివరాజు, ఎస్టీ మోర్చా జిల్లా నాయకుడు పాండు నాయక్, సురేశ్, అశోక్ రెడ్డితోపాటు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**దామరగిద్ద, అక్టోబరు 5 ప్రభాతవార్త :** పేరపళ్ళ గ్రామానికి చెందినటువంటి గొల్ల అనంతయ్య, బైకన్ వెంకటప్పలు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పేరపళ్ళ గ్రామం నుండి దామరగిద్ద మండలం బాపన్ పల్లి గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో దామరగిద్ద పోలీసులు పై వ్యక్తులను టిఎస్ 06యుడి 6311 (అనంతయ్య ట్రాక్టర్), టిఎస్31 హెచ్ 5966 (బైకెను వెంకటప్ప ట్రాక్టర్) నంబర్లు గల వారికి చెందినటువంటి రెండు ట్రాక్టర్లను కూడా దామరగిద్ద పోలీసులు స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

# నన్ను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేయండి

**- గంగాపూర్ గ్రామాభివృద్ధికి రూ. 50 లక్షలు ఇస్తా..**

**- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా ఓ ఆశావహుడి ఆఫర్**

**జడ్చర్ల,అక్టోబర్5, ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికల హడావుడి మొదలైంది. ఆశవాహుల్లో మరింత ఉత్సాహం పెరుగుతున్నది. ఈక్రమంలో సోషల్ మీడియాలో ఓ సర్పంచ్ ఆశావహుడి ప్రకటనతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైట్లు తెలుస్తున్నది. తనను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేస్తే గ్రామ అభివృద్ధికి రూ.50 లక్షలు విరాళంగా అందిస్తానని ఓ ఆశావహుడు ఆఫర్ ప్రకటించడం మండలంలో చర్చనీయాంశం అయింది. వివరాల్లోకి వెళ్తే మహబూబ్నగర్ జిల్లాలోని జడ్చర్ల మండల పరిధి గంగాపూర్ గ్రామపంచాయతీకి చెందిన మన్నెం రఘురాంరెడ్డి గంగాపూర్ గ్రామ ప్రజలకు ఒక ఆఫర్ ప్రకటించాడు. ఏ పార్టీలతో సంబంధం లేకుండా తనను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేయాలని, అలా చేస్తే తాను గ్రామ అభివృద్ధికి రూ. 50 లక్షలు విరాళంగా ప్రకటిస్తానని ఆ డబ్బుతో గ్రామంలో అత్యవసర పనులతో పాటు అభివృద్ధి పనులను చేపట్టొచ్చని సూచించారు. ఇదే విషయాన్ని కూడామీడియా ప్రతినిధులు ఫోన్లో స్పందించగా అవును తాను సర్పంచిగా చేయడానికి ఆసక్తిగా ఉన్నానని గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులు ఏ విధంగా స్పందిస్తారో, ఏకగ్రీవం చేయడానికి ఒప్పుకుంటారో ఇంకెవరైనా ముందుకొచ్చి మరింత ఆఫర్ ప్రకటిస్తారు తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



మన్నెం రఘురాంరెడ్డి

# పెరిగిన సాగు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నుండి నాలుగు బస్తాల వరకు అవసరం అవుతుంది. రవాణా ఖర్చు అదనం. 35 నత్రజని మాత్రమే పంటకు అందుతుంది, మిగతా నత్రజని ఆవిరై పోతుంది. దీని పనితనం పంటపై రెండు నుండి మూడు రోజుల మాత్రమే ఉంటుంది. వేర్ల నుండి ఆకులకు పంటపై భాగాలకు నత్రజని తక్కువగా చేరుతుంది మరియు చేరడానికి సమయం పడుతుంది. రెండు నుండి మూడు నెలల తర్వాత గడ్డకట్టే అవకాశం ఉంది. ఎరువుల కంపెనీలు యూరియా ఉత్పత్తికి అంతరాయం కలిగితే కొరత ఏర్పడుతుంది. ఎందుకంటే దీని ఉత్పత్తికి భారీ కర్మగారాలు అవసరమవుతాయి. ప్రభుత్వం ప్రతి యూరియా బస్తా పై రూపాయలు 1970/ కంపెనీలకు రాయితీ రూపంలో చెల్లిస్తుంది తద్వారా వీటి భారం ప్రజలపై పడుతుంది.

- వెంకటేశ్, డీఏవో, మహబూబ్‌నగర్

# నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

**మహబూబ్‌నగర్, అక్టోబరు5,ప్రభాతవార్త:** సోమవారం మధ్యాహ్నం2:00 గంటలకు అప్పన్నపల్లి వద్ద తిరుమలహిల్స్ పార్టీ కార్యాలయంలో జడ్చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో అనుచరించాల్సిన వ్యూహాల పై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి దిశనిర్దేశం చేయనున్నారు. ప్రతి గ్రామం నుంచి ఎవరైతే ఎన్నికలో (ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ )పోటీ చేయాలనీ అనుకుంటున్నారో మహిళలు కానీ పురుషులు కానీ అందరూ హాజరుకావాలని సూచించారు.

# వరద తగ్గుముఖం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 210.9946 టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల పవర్ హౌజ్ నుంచి 37982, సుంకేసుల నుంచి 13,333క్యూసెక్కులు,హంద్రీ నుంచి 250క్యూసెక్కులు వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ,కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 61,853క్యూసెక్కులు, గేట్ల ద్వారా 192990క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాంకు 1,45,300క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, 94,722క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది.



# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎమ్మెల్యే బలపరిచిన అభ్యర్థిని గెలిపించి మన గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాలలో వర్గ విభేదాలు ఎన్ని ఉన్న వాటిని పక్కకు పెట్టి ఎమ్మెల్యే బలపరిచిన అభ్యర్థిని గెలిపించి ఎమ్మెల్యే కు కానుకగా ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ జిల్లా సీనియర్ నాయకుల గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మహేశ్వర్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా శోభాయాత్ర

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నిష్టతో నిర్వహించామని వెల్లడించారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు ప్రతిరోజు ఒక ప్రత్యేకమై న అలంకారంతో దర్శనమిచ్చారని వెల్లడించారు. అమ్మవారు చల్లని ఆశీస్సులు మా కాలనీ ప్రజలపై ఉండాలని కాంక్షించామని వెల్లడించారు.



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

# గుంతల మయంగా రోడ్డు వాహనదారులకు తప్పని తిప్పలు

**చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు**

**పెబ్బేరు, అక్టోబరు 5 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలో సాయిబాబా ఆలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులకు పడుతున్నామని దీనివలన చాలా ప్రమాదలు జరిగి వర్షాకాలంలో గుంతల లో నీళ్ల చేరి వాహనాలు పోవడానికి చాలా ఇబ్బందిగా మారిందని వాహనదారులు తెలియజేశారు. రాత్రి వేళల్లో ఎదురుగా వాహనాలు వస్తే ఎటు సైడ్ పోవాలో తెలియక చాలామంది కింద పడుతున్నారని ఇప్పటికే ఐదు మందికి పైగా కిందపడి దెబ్బలు తగిలాయని అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న రని గుంతల రోడ్డు చూసి కూడా దాని సరిచేసే ప్రయత్నం చేయడం లేదని మామూలు మట్టేసి చేతులు దులుపుకుంటున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ గుంతలలో దామర్ కానీ, సిమెంట్ గాని వేస్తే మళ్లీ గుంతలు లేకుండా ఉంటుందని అలా చేయడం వలన ప్రమాదాలు కూడా జరగవని ఇప్పటికైనా అధికారులు త్వరగా స్పందించి వెంటనే మరమ్మత్తులు చేయాలని వాహనదారులు తెలియజేశారు.



పెద్ద పెద్ద గుంతలు పడ్డ రోడ్డు



వాహనాలకు ఇబ్బందిగా ఉన్న గుంతల రోడ్డు

ఆర్అండ్‌బి ఏఈ హనుమంతు వివరపెబ్బేర్ పట్టణంలో గుంతల గురించి టెండర్ వేశామని దానికి ఎవరు ముందుకు రావడం లేదని దానివల్ల పనులు చేయలేకపోతున్నామని. కానీ మూడు రోజుల్లో వేరే మనుషులను పెట్టి కంపల్సరీ పనులు చేపిస్తానని ఆర్అండ్‌బి ఏఈ హనుమంతు వార్తా ప్రతినిధికి చరవాణి ద్వారా సమాచారం ఇచ్చారు.

## చేర్యాలలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

**చేర్యాల,అక్టోబరు 5, ప్రభాతవార్త:** ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోరాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 27,1925 విజయ దశమి రోజున ఏర్పాటై ప్రస్తుత దసరాతో వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని దుర్గాదేవి ఆలయం నుండి ఇంటర్ ప్రభుత్వ కళాశాల వరకు పథ సంచలనం రూట్ మార్చ్ నిర్వహించారు.



చౌటకూరులో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పథసంచాలన్ చేస్తున్న దృశ్యం

## చౌటకూరులో ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు

**చౌటకూరు, అక్టోబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతజయంతి ఉత్సవాలను క్రమపద్ధతిలో ఘనంగా జరుపుకున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గ్రామంలోని పురవీధుల గుండా పథసంచాలన్ చేశారు. ఆర్ఎస్ఎస్ దేశానికి శ్రీరామ రక్ష అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆర్ఎస్ఎస్ జాతీయ కమిటి పిలుపు మేరకు కవాతు న్విహిస్తున్నట్లు గోరక్ష జిల్లా ప్రముఖ్ పల్లె ప్రభుకుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సాయం

**ధూళిమిట్ట,అక్టోబరు 5, ప్రభాతవార్త:** మండలంలోని బెక్కల్ గ్రామ శివాలితండాకు చెందిన లకావత్ జ్యోతి రాజుల కుమార్తె లకావత్ కళ్యాణి ఇటివల నిర్వహించిన నీట్‌లో ఎంబిబిఎస్ సీట్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన వారి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ కళ్యాణిని చదివించారు. వైద్య విద్య ఖర్చుతో కూడుకుందని విషయం తెలు సుకున్న జిల్లా యూత్ కాంగ్రేస్ వైస్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్ ఆదివారం వారి ఇంటికి వెళ్ళి తెలంగాణ యూత్ కాంగ్రేస్ ఆధర్యంలో కళ్యాణిని అభినందించి మిత్రుల సహకారంతో తమ వంతుగా రూ.22వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కూకట్ల బాలరాజ్ యాదవ్, లకావత్ యాదగిరి, బాలయ్య, సాగర్‌గౌడ్, మహేష్‌గౌడ్, జక్కు నరేష్ యాదవ్, రమేష్ ముదిరాజ్, లింగాల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 5 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆదివారం స్థానిక పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల పరిశీలకులు తలకొక్కుల రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 9వ తేదీన నామినేషన్ల పరిశీలన, 10వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 11వ తేదీన ఉదయం 11 గంటలకు నామినేషన్ వేసిన అభ్యర్థులతో ఎలక్షన్ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు సాయంత్రం 6 గంటలకు తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు డమ్మీ బ్యాలెట్ పేపర్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. 19వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించి 4 గంటలకు ఓట్ల లెక్కింపు, సాయంత్రం 5 గంటలకు గెలిచిన అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలిపారు. 5.30 గంటలకు గెలిచిన అభ్యర్థులచే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు దేవులపల్లి రాజారాం, రాష్ట్ర కార్యదర్శి స్వర్గం రాజేశం, మాజీ



ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న తలకొక్కుల రాజు

మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ అధ్యక్షుడు గాడిపల్లి శ్రీనివాస్, జిల్లా పద్మశాలి సంఘం యువజన అధ్యక్షుడు గాడిపల్లి అనూప్, ఎన్నికల కమిటీ సభ్యులు తలకొక్కుల దేవదాస్, చంద్రం, పెంటయ్య, కృష్ణ, యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నాయకులు రాజేశం, జిల్లా ప్రచార కార్యదర్శి గాడిపల్లి బలరాం, తుమ్మ నర్సింలు, గాడిపల్లి విజయ్‌కుమార్, రమేష్, మధుసూదన్, దేవసాని వాసుదేవ్, కోట కిషోర్, మల్లేశం, దేవసాని పోశెట్టి, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు

## ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం




విజయదశమి ఉత్సవంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

**వర్గల్, అక్టోబరు 5 (ప్రభాతవార్త):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం వర్గల్ మండలకేంద్రంలో పథసంచాలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ వక్త రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మెదక్ విభాగ్ హిందూ వాహిని ప్రముఖ్ ఎల్లగొని సత్యంజి, ముఖ్య అతిథి పురుషోత్తంలు మాట్లాడుతూ కుటుంబ ప్రబోధన్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, పౌర నియమావళి, స్వదేశీ ప్రేమ అనే అంశాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని, కుటుంబ ప్రేమ, సమాజ ప్రేమ ఉంటేనే దేశ రక్షణలో భాగస్వాములు కావచ్చునని పేర్కొన్నారు. హిందూ సమాజం జాగృతం కావడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. రాబోవు రోజులలో మరిన్ని కార్యక్రమాలతో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి

## నాచగిరిలో భక్తుల సందడి



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

వర్గల్, అక్టోబరు 5 (ప్రభాతవార్త): మండల పరిధి లోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. దసరా సెలవులు చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## వార్త ప్రభావం: ఖాజాపూర్ గ్రామస్థులకు ఊరట...

### గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం

**సిర్గాపూర్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** గత వారం రోజులుగా మండలంలోని ఖాజాపూర్ గ్రామస్థులు తాగునీటి కొరకు పడుతున్న పాట్లను ప్రభాతవార్త ఈ నెల 3న ఖాజాపూర్‌లో తాగునీటి కష్టాలు, పంచాయితీ కార్యదర్శిపై ఆగ్రామం, ఈ నెల 4న తారీఖున ఖాజాపూర్‌లో తాగునీటి ఎద్దడి- ఖాళీ బిందెలతో మహిళల నిరసన శీర్షిక లతో ప్రచురించిన కథనాలకు జిల్లా అధికారు స్పందించారు. గ్రామం లోని బోర్లకు మోటార్లు బిగించి నీటి సరఫరాకు చర్యలు తీసుకు న్నారు. మరో రెండు రోజుల్లో మిషన్ భగీరథ నీరు గ్రామానికి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈఈ షేఖ్ పాషా, డిఈఈ పహాని వర్మ, ఏఈ జైపాల్‌లు గ్రామస్థులకు భరోసా కల్పించారు.

## విద్యార్థులను సన్మానించిన బిసి సంక్షేమ సంఘం



నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా బిసి సంక్షేమ సంఘం బాధ్యులు

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** నీట్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటి ఎంబిబిఎస్‌లో విద్యను అందుకునేందుకు అర్హత సాధించిన విద్యార్థులను (జంగం ధీరజ్ స్వామి, మఠం బిల్వ శ్రేష్ట, పట్లోళ్ల సుదీప, చల్మెడ మహాదేవ్, పడిశెట్టి శ్రావ్య, మడపతి కాతాయయిని, నాయికోటి కీర్తన)లను సంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వైయస్సార్ భవన్‌లో సంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రభుగౌడ్, డాక్టర్ మల్లికార్జున, సంఘం ప్రధాన కార్యదర్శి గోకుల్ కృష్ణ, జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ స్వామి, ముఖ్య సలహాదారులు చంద్రయ్యస్వామి, కార్యదర్శి సుధాకర్‌గౌడ్, అధికార ప్రతినిధి మంగ గౌడ్, కార్య విభాగ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు జావీద్, సంగమేశ్వర్, శివ, ప్రభు, ఎన్ శివ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## పార్టీ కోసం పనిచేసిన వారికే టికెట్లు



మొగుడంపల్లి మండల కాంగ్రెస్ కార్యకర్తలతో మాజీ మంత్రి, సెట్విన్ చైర్మన్

### -మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

**జహీరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నంటి ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేసిన కార్యకర్తలకే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు కేటాయిస్తామని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం మొగుడంపల్లి మండల కేంద్రంలో మండల పార్టీ కార్యకర్తల సమావేశాన్నిఆజాన ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్న నాయకులు, కార్యకర్తలు తమ పేర్లను మండల కమిటి అధ్యక్షులకు పంపాలన్నారు. పోటీ చేసే అభ్యర్థుల పేర్లను జిల్లా కమిటి పరిశీలించాక టికెట్లు కేటాయిస్తారని, అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జండా ఎగిరేలా కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని మండల పార్టీ బాధ్యులకు మాజీ మంత్రి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ చైర్మణ ఎన్ గిరిధర్‌రెడ్డి, మాజీ ఎండస్ట్రీయల్ చైర్మన్ మహ్మద్ తన్వీర్, సిడిసి చైర్మన్ మోబిన్, డిసిసిబి డైరెక్టర్ కిషన్‌రావు పవర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎన్ ఉజ్వల్‌రెడ్డి, మండల అధ్యక్షులు మహమ్మద్ మక్సూద్ ఆహ్మద్, మాజీ ఎంపిటిసి సభ్యులు అశోక్, నాయకులు శుక్లవర్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వైశ్యులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీచేస్తున్న కిరాణ వర్తక సంఘం సభ్యులు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 5 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని నిరుపేద వైశ్యులకు ఆదివారం గజ్వేల్ కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ధి బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ, దూబకుంట మైత్రాములు, మర్యాల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిరాణ వర్తక సంఘం ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా నిరుపేద వైశ్యులకు ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. నిరుపేదలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులో లేదని అన్నారు. వాసవి మాత అనుగ్రహం అందరి పై ఉండాలని, రాబోయే కాలంలో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు కిరాణ వర్తక సంఘం తరపున చేయాలని మా కమిటీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపర్తి వైకుంఠం, గుడాల మెట్టయ్య, దూబకుంట ప్రభాకర్, దార రామచంద్రం, మర్యాల లింగం, బెజుగామ రాము, నేతి రాజు, భైరవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం



న్యాయవాది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

### -లయన్ సంజయ్‌గుప్తా

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 5 (ప్రభాతవార్త):** సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని, మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్‌గుప్తా అన్నారు. గజ్వేల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ సాధారణ సమావేశం క్లబ్ అధ్యక్షుడు, తాజా మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురిని సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం సంజయ్‌గుప్తా మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని, సేవ చేయాలి అనుకునేవారు లయన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు ఉప్పల మెట్టయ్య, సభ్యులు నంగునూరి సత్యనారాయణ, గోలి సంతోష్, రామ్‌ఫణిదర్‌రావు, మల్లేశంగౌడ్, నేతి శ్రీనివాస్, పరమేశ్వరచారి, గుడాల రాధాకృష్ణ, డాక్టర్ కుమారస్వామి, మధుసూదన్, న్యాయవాది శ్రీనివాస్, రాజారాం, సంతోష్, తాటి రాములు తదితరులు పాల్గొన్నారు.

### ఎంబిబిఎస్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు టీ బేస్ ఆధ్వర్యంలో సన్మానం

**జహీరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** నీట్ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించి ఎంబిబిఎస్‌లో విద్యను అందుకునేందుకు అర్హత సాధించిన విద్యార్థులను (వైష్ణవి-మధులై తండా), (పింకీ రాథోడ్-నందు నాయక్ తండా), (సావిత్రి-విట్టు నాయక్ తండా), (బలరామ్-మందగుబ్బడి తండా), (దీపక్-కుంచారం పల్లి తండా) టీ బేస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టి బేస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తులసీరామ్ రాథోడ్, డాక్టర్ సునీల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చౌహాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ బానోత్, హీరాలాల్ చౌహాన్, దేవిసింగ్ రాథోడ్, డివిజన్ అధ్యక్షులు తుకారామ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి హన్మంత్ పవార్, గౌరవ అధ్యక్షులు మీరు రాథోడ్, నాయకులు రూప్ సింగ్, శంకర్, ధన్‌రాజ్, లాల్‌సింగ్, శంకర్, నర్సింగ్ పవార్,, శెట్టి, చందర్, పాండు పవార్, రవి, గోవింద్, గణేష్, సంతోష్, మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయం



తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తుల దృశ్యం

**కౌడిపల్లి, ఆగష్టు 10, ప్రభాతవార్త:** జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆదివారంనాడు భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండియే భక్తుల తాకిడి పెరుగుతూపోయింది. తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివప్ప వేదమంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. ఆకాల వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు సైతం లెక్కచేయకుండా శివసత్తుల శిగాలు, డప్పు చప్పుడుల దరువుల నడుమ అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మవారి ఎదుట బోనం నైవేద్యాలను పెట్టి, తీర్థప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వాచనం పొందారు. కొంత మంది భక్తులు తమ కోరికలు తీర్చిన శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ఒడి బియ్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంవద్ద భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

వర్షం వచ్చే సమయంలో ఆలయం వద్ద నాల్గు షెడ్లు మాత్రమే ఉన్నాయి. ఆవి కూడా పెద్దగా ఉండి వర్షం నీరు, గాలి వచ్చేవిధంగా ఉండటంతో భక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచినంత విరాళాలు ఇస్తే భక్తులకు కాటేజ్‌లు నిర్మిం చబడుతాయని ఇంచార్జి ఈవో రంగారావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఆలయం జూనియక్ ఆసిస్టెంట్ వెంకట్ రెడ్డి, గ్రామ పెద్దలు సాయాగౌడు, శంకర్, శేఖర్, చల్లమల్లేశం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మైకోడ్‌లో హోమ పూజల్లో పాల్గొన్న గ్రామ భక్తులు

## గ్రామ సుభిక్షానికి మైకోడ్‌లో హోమాలు

**మనూర్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** గ్రామం సుభిక్షాన్ని కాంక్షిస్తూ ఆదివారం మండల పరిధిలోని మైకోడ్‌లో వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో గ్రామస్థులు హోమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి మాసంలో వచ్చే మొదటి ఆదివారం గ్రామానికి చెందిన దంపతులచే వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో హోమాలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఇందులో భాగంగా అక్టోబరు మాసంలో 5వ తారీఖున వచ్చిన ఆదివారం గ్రామానికి చెందిన బసవరాజు దంపతులచే అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) అందచేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### రాంరెడ్డి కుటుంబ సభ్యులను
## పరామర్శించిన చంద్రశేఖర్‌రెడ్డి



గడీల రాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

**మనూర్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దుదగొండ గ్రామానికి చెందిన గడీల రాంరెడ్డి తనయుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందినట్లు తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం దుదగొండ గ్రామానికి చేరుకుని రాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రశేఖర్‌రెడ్డి వెంట నాయకులు మాజీ సర్పంచ్ శేరి రాజు, నాయకులు చందు పాటిల్, విఠల్‌రెడ్డి, రాజు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## మంజీరాలో గల్లంతైన మృతదేహం లభ్యం
### -బ్రాస్‌లేట్ ఆధారంగా వ్యక్తి గుర్తింపు

**చౌటకూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మద్యం మత్తులో మంజీర నదిలో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని నెల రోజుల తర్వాత లభ్యమయింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండలంలోని శివంపేట గ్రామానికి చెందిన బడంపేట మల్లాగౌడ్ (45) ఆగస్టు 29వ తారీఖున గ్రామ సమీపంలోని మంజీర నదిలో దూకి గల్లంతయిన విషయం పాఠకులకు విధితమే. గల్లంతైన మల్లాగౌడ్ ఆచూకి కోసం పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ బృంధాలు, ఎయిర్ బోట్లు, డ్రోన్ కెమెరాలతో అప్పట్లో రెండు మూడు రోజులు గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. నదిలో దూకి ఆచూకి కానరాకపోవడంతో మృతి చెంది ఉంటాడని మల్లాగౌడ్ కుటుంబ సభ్యులు కర్మకాండ సైతం పూర్తి చేశారు. 35 రోజుల తర్వాత సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గడంతో సంగారెడ్డి మండలం గౌడిచర్ల గ్రామ శివారులో నీట మునిగి గల్లంతయిన మల్లాగౌడ్ మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహం చేతికి ఉన్న బ్రాస్‌లేట్ ఆధారంగా శవం మల్లారెడ్డిదిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విశ్వజన్ మంజీర నది తీర ప్రాంతానికి చేరుకుని సంఘటన స్థలంలోనే పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మంజీరా నదిలో గల్లంతై మృతి చెందిన మల్లాగౌడ్ (ఫైల్ ఫోటో)

## బిఆర్ఎస్‌లో చేరిన బిజెపి నేతలు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండల బిజెపి నేతలు శనివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు నేతృత్వంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని రాజోల, మరియంపూర్, గణేష్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన బిజెపి నాయకులు మాజీ ఎంపిపి అధ్యక్షులు పాండురంగరావు పాటిల్, మరియంపూర్ మాజీ సర్పంచ్ బస్వరాజ్ పాటిల్, గణేష్‌పూర్‌కు చెందిన వ్యాపార వేత్త మల్లప్ప, వీర్‌శెట్టి, రాజు, జెరప్పలు తమ అనుచరులతో బిఆర్ఎస్‌లో చేరగా మాజీ మంత్రి పార్టీ ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు బిరేఆర్ అప్పారావు పాటిల్, రాజేందర్‌రెడ్డి, దేవదాస్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో విషాదం
### డెంగ్యూ జ్వరంతో విద్యార్థి మృతి

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 5, ప్రభాతవార్త:** డెంగ్యూ జ్వరంతో ఒ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధి ఎస్ కొండాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన శ్యామ్, పుష్పలతల కుమారుడు ప్రభాస్(20), భాగ్యనగరంలోని కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. పది రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో ఇంటికి వచ్చి మెదక్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోగా అక్కడ డెంగ్యూ వ్యాధిగా నిర్ధారణ అయింది. మెరుగైన వైద్యం కోసం భాగ్యగనగరంలోని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కటుంబసభ్యులు తెలిపారు. ప్రభాస్ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా ఈ విషయమై మండల వైద్యాధికారి సాయి సింధూను సంప్రదించగా ఈ విషయంపై వైద్య నివేదిక అందలేదని, నివేదిక అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే గ్రామంలో వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి, గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.



డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన ప్రభాస్

## నల్లవాగు ప్రాజెక్టుకు వరద ప్రవాహం

**సిర్గాపూర్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** నల్లవాగు ప్రాజెక్టుకు స్వల్పంగా వరద ప్రభావం కొనసాగుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 212 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి చేరిందని ఏఈ శ్రీవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అలుగు ద్వార 102 క్యూసెక్కులు, పంట కాలువల ద్వార 110 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయన్నారు. ప్రాజెక్టు ఫుల్ రిజార్వయర్ లెవల్ 1493 ఫీట్లకు 1493.08 ఫీట్ల వద్ద నీటి మట్టం ఉందని ఏఈ వివరించారు.

## మండలంలో దంచి కొట్టిన వాన

**సిర్గాపూర్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గౌడ్గామ, వంగ్దల్ వాసర్, నాగన్‌పల్లి, పోట్‌పల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులతో వర్షం దంచి కొట్టింది. ఉదయం కురిసిన వర్షంతో సాగవుతున్న పంటలు నీటిపాలైనట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి అన్నదాతలను ఆదుకోవాలని రైతులు వినతి చేస్తున్నారు.